సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: జేమ్స్ స్ట్రీట్, అడ్డగుట్ట, లాలాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉ.10 గం నుంచి 11 వరకు ప్యారడైజ్ సిగ్నల్, ఫైర్ స్టేషన్ నుంచి రసూల్‌పూరా వరకు.
- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు రవీంద్రనగర్, మోడల్ స్కూల్ పీటీ, ధోబీఘాట్, ఈఎఫ్ఎల్ వెనుక వైపు, మాణికేశ్వరీనగర్ ప్రాంతాలు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇందిరానగర్, లాలాపేట్ కమాన్, గణేష్ టెంపుల్, ఇసుకబావి, లక్ష్మీనగర్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్ ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లంబాడీబస్తీ, కనకదుర్గా అపార్ట్‌మెంట్, సండేమార్కెట్, విజయ డైరీ, ఘరొండా అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మార్చిలో పీజీ కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు పేర్కొన్నారు. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు పీజీ కాలేజీలో కొనసాగుతున్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, సోషల్ వర్క్ రెగ్యులర్ పీజీ కోర్సులతో పాటు నిజాం కాలేజీలోని ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 28 వరకు, రూ.300 అపరాధ రుసుంతో వచ్చే నెల 13 వరకు ఫీజు చెల్లించాలన్నారు.

మంత్రికి ఆహ్వానం

అమీర్‌పేట: అమీర్‌పేట హనుమాన్ దేవస్థానంలో రాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి ఎం.విఠలయ్య తెలిపారు. 18వ తేదీన జరిగే ఉత్సవాలకు హాజరుకావాలని గురువారం ఆయన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

అరుదైన శస్త్రచికిత్సతో 7.5 కిలోల కణితి తొలగింపు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి గైనకాలజీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో కడుపులోని 7.5 కిలోల కణితిని తొలగించారు. గైనకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సంగీత తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన ఓ యువతి (19) కొంతకాలంగా తీవ్ర అస్వస్థతతో బాధ పడుతోంది. వారం రోజుల క్రితం గాంధీఆస్పత్రిలో చేరగా వైద్యపరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో ప్రమాదకర కణితి (ట్యూమర్) పెరుగుతున్నట్లు గుర్తించారు. గురువారం సుమారు మూడు గంటల శ్రమించి కడుపులోని భారీ కణితిని తొలగించారు. బాధితురాలు కోలుకుంటుందని, త్వరలోనే డిశ్చార్జి చేస్తామని వెల్లడించారు.

మొల్ల, శాలివాహన చక్రవర్తి చరిత్రపై వ్యాసరచన పోటీలు

లాలాపేట: కవయిత్రి మొల్ల, శాలివాహన చక్రవర్తి జయంతిలను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు కుమ్మరి, శాలివాహన వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షులు నిరుకొండ నరేష్, ఉపాధ్యక్షుడు దాసారపు రాజు, ప్రధాన కార్యదర్శి దునుకు వేలాద్రి తెలిపారు. గురువారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కవయిత్రి మొల్ల జయంతి 13 మార్చి, శాలివాహన చక్రవర్తి జయంతి మార్చి 22న పురస్కరించుకుని వారి జీవిత చరిత్రపై సమగ్రమైన వ్యాసాలను రాసి పంపాలని కోరారు. ఉత్తమమైన వ్యాస రచనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000699941, 9000729590 నంబర్లను సంప్రదించాలన్నారు.

కార్యవర్గం.. ప్రమాణ స్వీకారం

అమీర్‌పేట: అమీర్‌పేట వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు సింగారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధ్యక్షులుగా అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోషాధికారిగా బాలాజీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భాస్కర్, ఉపేందర్, రామారావు, వెంకటేశ్వర్లు, జయదుర్గ, మాధవ రావు, రాజేంద్ర పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



లాలాపేట: తార్నాకలో నాగేశ్వర్‌రావు, కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం కనుల పండుగగా జరిగింది. వేదాంతం తిరుమలి వేంకటేశ్వర ప్రసాదాచార్యుల నేతృత్వంలో వేద పండితుల సమక్షంలో శాంతి హోమం, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లాలాగుడి.. ఉత్సవాలకు రెడీ

- శివరాత్రి వేడుకలకు ముస్తాబైన లాలాగుడి దేవాలయం
- రంగులు, విద్యుద్దీపాలతో అలంకరణ
- ఏర్పాట్లలో నిమగ్నమైన నిర్వాహకులు



లాలాగుడిలోని శివాలయం



ఉపవాసాలు ఉండి జాగరణతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు.

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ రాణిగంజ్ పాన్‌బజార్‌లోని చరిత్రాత్మక లాలాగుడి దేవాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. గతమెంతో ఘన చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి యేడాది లాగే ఈ సారి కూడా మరింత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నెల 18 శనివారం జరిగే మహాశివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని ఈ దేవాలయానికి రెండు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఏటా ఈ ఆలయంలో శివరాత్రి వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శివపార్వతుల కల్యాణోత్సవంలో పాలుపంచుకుంటారు.

ఉపవాసాలు, జాగరణ

శివరాత్రి రోజు ఉపవాసాలు ఉన్న భక్తులు పెద్ద ఎత్తున ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి ఉపవాసాన్ని విరమిస్తారు. శివరాత్రి రోజు దేవాలయం భక్తులతో కళకళలాడటంతో పాటు పరిసరాలు భక్తి పారవశ్యంతో కోలాహలంగా కనిపిస్తాయి. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలైన జనరల్ బజార్, రాణిగంజ్, ఎంజీ రోడ్డు, ఓల్డ్ బోయిగూడ, ఆర్పీ రోడ్డు, పాన్‌బజార్, మోండా మార్కెట్, టకార బస్తీ, గాంధీనగర్, శివాజీనగర్ చుట్టూ పక్కలా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు మహాశివరాత్రి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివుడు ఉద్భవించిన కాలంలో స్వామివారిని దర్శించుకుంటే పాపాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. ఆ రోజుల భక్తులు

ఆలయ చరిత్ర..

ఈ ఆలయంలోని శివుడిని ఖడ్గేశ్వర్ మహాదేవ్‌గా భావిస్తారు. ఇక్కడి శివలింగం స్వయంగా ఉద్భవించిందని, నగరంలోని స్వయం భూ శివాలయాల్లో ఈ గుడికి మహోన్నత స్థానం ఉన్నట్లుగా చెబుతారు. పూర్వం ఓ భక్తుడు శివనామస్మరణ చేస్తూ ఇక్కడే జీవసమాధి అయ్యాడని చెప్పుకొంటారు. అప్పటి నుంచి వంశపారంపర్యంగా ప్రధానార్చకులుగా వ్యవహరిస్తున్న వారి ఏడో తరానికి చెందిన రాధాకృష్ణగోండేకర్ ప్రస్తుతం పూజాధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేవాలయం ఆవరణలో నవగ్రహాలు, లక్ష్మీనారాయణ స్వామి, ఆంజనేయస్వామి, దత్తాత్రేయ ఆలయాలు ఉన్నాయి. సదరు దేవాలయంలో నిత్యం పూజాది కార్యక్రమాలు కొనసాగుతాయి.

విస్తృతమైన ఏర్పాట్లు..

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో పలు శివాలయాలు మహాశివరాత్రి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే దేవాలయాలను రంగులతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. హమాల్‌బస్తీ, బోలక్‌పూర్, బోయిగూడ, మోండా మార్కెట్, రాణిగంజ్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలు మహాశివరాత్రి కోసం సిద్ధమయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో నిమగ్నమయ్యారు.

సీఎం వివక్షతోనే కంటోన్మెంట్ అభివృద్ధికి దూరం

- బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ



వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ కంటోన్మెంట్ బోర్డుపై వివక్ష చూపుతుండడంతో అభివృద్ధి జరగడం లేదని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ ఆరోపించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు మాదరపు ఆశోక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రజాగోస- బీజేపీ భరోసాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉచిత మంచినీటి పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలు, వారంలో ఒకేసారి తాగునీటి సరఫరా అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీఎం కాకముందు రసూల్‌పురా ప్రాంతాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఈ ప్రాంతం మీదుగా ఫాంహౌజ్‌కు వెళ్తున్న దత్తత విషయం గుర్తుకు రావడం లేదని విమర్శించారు. బోర్డుకు రావాల్సిన నిధులను దొడ్డిదారిన జీవో తీసి తన ఖజానాకు తరలించుకుంటున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని తాను కోర్టును ఆశ్రయిస్తే దశలవారీగా డబ్బులు విడుదల చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, సత్తిరెడ్డి, శ్రీహరి రెడ్డి, శ్యామ్, మమత, రామాంజనేయులు, రవికుమార్, ప్రశాంత్, స్వాతి పాల్గొన్నారు.

ఓయూ వీసీపై మంత్రికి ఫిర్యాదు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌పై గురువారం ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర వర్సిటీల మాదిరి కాకుండా యూజీసీ పేరుతో ఇష్టారాజ్యంగా సెంట్రల్ యూనివర్సిటీల తరహాలో పీహెచ్‌డీ ప్రవేశాల పక్రియను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఓయూలో ఐదేళ్ల తర్వాత పాత నిబంధనలతో 2022 ఆగస్టులో పీహెచ్‌డీ నోటిఫికేషన్ వెలువడగా నవంబరులో వచ్చిన కొత్త నిబంధనలను పాటిస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లపై ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని వినతిలో పేర్కొన్నారు. జపాన్ నుంచి వీసీ రాగానే చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు తెలిపారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే

- మాజీ మేయర్ కార్తీకరెడ్డి

అడ్డగుట్ట: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం నార్త్‌లాలాగూడలోని లిల్లీ మోడల్ స్కూల్ సమీపంలో నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసాలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానని చెప్పి కల్వకుంట్ల కుటుంబాన్ని మాత్రమే బంగారు కుటుంబంగా మార్చారని ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్రూమ్‌ల ఊసే లేదని, నిరుద్యోగ భృతి ఇప్పటికీ అమలులోకి రావడం లేదన్నారు. కేవలం మాటల గారడి చేసి గెలిచిన కేసీఆర్‌కు ఈ సారి గుణపాఠం తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మేకల సారంగపాణి, మహేష్‌గౌడ్, కన్నాభిరాం, శారద మల్లేష్, రమేష్, అనిల్, నరేందర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డు పొందాలి



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

అడ్డగుట్ట: భవన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డు పొందాలని ఏఐటీయూసీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గౌరి నాగరాజు సూచించారు. డివిజన్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లేబర్ కార్డు తీసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలని సూచించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, యాదగిరి, శ్రీనివాస్, యాదగిరి, శంకర్, మల్లేష్, అంజయ్య, సింగరయ్య, ఎల్లయ్య, రామస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పాటిగడ్డలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుంటే స్థానికులతో కలిసి వాటర్‌వర్క్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి హెచ్చరించారు. స్థానికులు ఫిర్యాదు మేరకు గురువారం ఆయన పాటిగడ్డ వడ్డెరబస్తీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్యను పరిశీలించి అక్కడి నుంచే వాటర్‌వర్క్స్ డీజీఎం, జీఎంలకు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడే పార్టీ బీజేపీ అని ఎక్కడ సమస్య ఉంటే అక్కడ తాను ముందుండి పరిష్కారానికి పోరాడుతానన్నారు. కార్యక్రమంలో నెమలి ఆనంద్, గౌస్, గోవింద్, శ్రవణ్, మధు, నగేష్, పద్మ, మురళి, జనార్దన్, మధుసూదన్, సతీష్, ముజఫర్, శైలేందర్, సింఘానియా, రాజేష్, జంగయ్య పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం దాత పుష్పాల కల్యాణ్ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ ప్రత్యేక పూజలు చేశారు. పూజలో చైర్మన్ దత్తు, నాయకులు కరాటే రాజు, చిట్టి, రాము, విజయ్ కుమార్, గోపి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ హేమ

ఓయూలో పుస్తకాల పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని ఓయూలో ఉద్యోగ పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆధ్వర్యంలో దివ్యాంగులు, నిరుద్యోగులకు పుస్తకాలు అందజేశారు. రమేష్, రాజేష్‌నాయక్, శశిపాల్, పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: రోటరీ గ్లోబల్ విజర్డ్స్ ఆధ్వర్యంలో అడ్డగుట్ట డీ-సెక్షన్‌లోని కమ్యూనిటీ హాల్లో నేడు (శుక్రవారం) ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోగ్య పరీక్షలతో పాటు మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి బృందం తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లోని శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. గురువారం ఓ రేషన్ షాపు నుంచి నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఓ వ్యక్తి ప్లాస్టిక్ సంచుల్లో తరలించేందుకు యత్నించగా మధు, సాయి అనే ఇద్దరు అడ్డుకుని ఆరా తీస్తుండగా సదరు వ్యక్తి బియ్యం సంచులను అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించారు. పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ విష్ణు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బియ్యాన్ని తరలించే వ్యక్తి గురించి ఆరా తీస్తున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న సీఐ శ్రీనివాస్‌రావు

రసూల్‌పురా: సెల్‌ఫోన్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని బేగంపేట సీఐ శ్రీనివాస్ రావు సూచించారు. గురువారం నిర్వహించిన మమతా హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్నేహితుల ప్రభావంతో కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి ఆయన ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘మిస్సింగ్’ ఫిర్యాదుపై పోలీసుల నిర్లక్ష్యం



మందటి బాలకృష్ణ

కాప్రా: కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడకు చెందిన మందటి బాలకృష్ణను అనారోగ్య కారణంగా గత నెల 25న ఎర్రగడ్డలోని ఈఎస్ఐ చెస్ట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల కోసం తర్వాతి రోజు ఆస్పత్రిలో ఉన్న స్కానింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. జనాలు ఎక్కువగా ఉండటంతో బాలకృష్ణను అక్కడే కూర్చొబెట్టి భార్య వెళ్లి భోజనం తీసుకొచ్చేలోపు అక్కడ బాలకృష్ణ కనిపించలేదు. సమాచారం అందుకున్న కుమారుడు రాజేశ్వర్‌కు ఆస్పత్రికి వచ్చి వెతకగా ఆచూకీ లేకపోవడంతో 28న ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఆశ్రయించారు. పలు ప్రాంతాల్లో వెతకగా తండ్రి జాడ తెలియకపోవడంతో మరోసారి పోలీసులను ఆశ్రయించగా అప్పుడిచ్చిన ఫిర్యాదు ఎక్కడో పోయింది. మళ్లీ ఇవ్వాలని పోలీసులు తెలపడంతో ఫిబ్రవరి 15వ ఫిర్యాదు చేశానని రాజేశ్వర్ పేర్కొన్నాడు. ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడని పోలీసులను ఆశ్రయిస్తే వాళ్లే ఇలా ఇచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే తమకు న్యాయం ఎలా జరుగుతుందని బాధితులు కంటతడి పెడుతున్నారు.